జలం కాదు.. గరళం



రోగాలతో ఆస్పత్రులకు..

అందరూ పేద ప్రజలు నివాసం ఉండే ప్రాంతం..తాగునీటి పైప్‌లైన్‌లోకి మురుగునీరు చేరడంతో కలుషిత నీరు తాగి స్థానిక ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఇరుకు సందుల్లో నివసించే ప్రజలకు ఇప్పటికీ తాగునీరు కలుషిత నీటితో కలిసి సరఫరా అవుతోంది. ఈ నీటిని తాగుతున్న స్థానికులకు వాంతులు, విరేచనాలు, విష జ్వరాలు నిత్యకృత్యమవుతున్నాయి. –దిల్‌సుఖ్‌నగర్‌

- ఎన్టీఆర్‌నగర్‌ ఫేజ్‌–2లో కలుషిత నీటి సరఫరా
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌ ఫేజ్‌–2లో తరుచూ మంచినీటిలో డ్రైనేజీ నీరు కలిసి రావడంతో అక్కడి ప్రజలకు నీరు లేక ఇక్కట్లకు గురవుతున్నారు. అక్కడ డ్రైనేజీ లైన్‌ నుంచి తాగునీటి పైప్‌లైన్‌ ఉండడంతో తరుచూ మంచినీటిలో డ్రైనేజీ నీళ్లు కలిసి వస్తున్నాయి. ఈ విషయంపై స్థానికులు ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ఫలితం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంచినీటిలో డ్రైనేజీ నీరు వస్తున్నా జలమండలి అధికారుల మౌనానికి అర్థం ఏంటోనని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీరు తాగి అక్కడి ప్రజలు విష జ్వరాలతో మంచాలు పడుతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరిగి కష్టపడి సంపాదించుకున్న డబ్బులు వైద్యానికి పెట్టాల్సి వస్తోందని ఎన్టీఆర్‌నగర్‌ బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా మరమ్మతు

ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునే నాథులే లేరని వాపోతున్నారు. ఈ సమస్యపై లెక్కకు మించిన సార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరీ ఫిర్యాదులు ఎక్కువగా వస్తే తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి మళ్లీ ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని మహేశ్వరం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా అధికారుల్లో చలనం లేదని మరి మా సమస్యను ఇంకెవ్వరికి చెప్పుకోవాలో అని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాగునీటిలో మురికినీరు వస్తున్నాయంటూ నిరసన తెలుపుతున్న స్థానికులు

డబ్బులు పెట్టి కొనుగోలు..

కలుషిత జలాల సరఫరాతో నిత్యం నీరు కొనుగోలు చేస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. జలమండలి అధికారులు వారంలో ఒక్కసారి ట్యాంకర్ల ద్వారా పంపించే వారు ఇప్పుడు డబ్బులు కడితేనే పంపుతామని చెబుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కష్టం చేస్తేనే వచ్చే డబ్బులు మంచి నీటి కొనుగోలుకే పెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎన్టీఆర్‌నగర్‌ ఫేజ్‌–2లో కలుషిత నీటి సరఫరాకు కట్టడి చేయాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశాం..



ఎన్టీఆర్‌నగర్‌ ఫేజ్‌–2లో మంచినీటిలో మురికి నీరు సరఫరా కావడంతో అదే నీరు తాగి అనేక మంది నిత్యం అస్వస్థతకు గురవుతున్నారు. వాంతులు, విరేచనాలు, వికారం, విష జ్వరాలు వ్యాధులు మాకు సర్వ సాధారణమయ్యాయి. చేసిన కష్టం డబ్బులన్నీ ఆస్పత్రులకు పెట్టాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌కూ ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

–లక్ష్మి, ఎన్టీఆర్‌నగర్‌ ఫేజ్‌–2

చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయి..



కలుషిత జలాలు సరఫరా కావడంతో కనీసం వాడుకునే పరిస్థితి లేదు. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా చిన్న పిల్లలు చర్మ వ్యాధులు, ఎలర్జీతో రోగాల బారిన పడుతున్నారు. మంచినీరు కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలోని పాతలైన్‌ మార్చి నూతన లైన్‌ వేయాలి.

–యాదమ్మ, స్థానికురాలు

అధికారులు స్పందించాలి..



ఎన్టీఆర్‌నగర్‌ ఫేజ్‌–2లో కలుషిత జలాల సరఫరాపై జలమండలితో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అక్కడ ఉండే ప్రజలు అందరూ పేద, మధ్యతరగతి వారే.మంచినీరు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. కలుషిత నీరు తాగి ప్రాణాలు పోతే తప్ప అధికారులు పట్టించుకోరా.. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలి.

– బాతరాజు నరసింహ, సీపీఐ నాయకులు

మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం



యాదిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని.. మూసీ ప్రక్షాళన పేరుతో అక్కడుండే వారికి న్యాయం చేయకుండా వారి ఇళ్లు కులగొడతామంటే ఒప్పుకునేది లేదని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్‌ పరిధి వినాయక నగర్‌కాలనీలో తాతల కాలం నుంచి ఉన్న పట్టా స్థలంలో దాదాపు 53 ఏళ్ల నుంచి నివాసముంటున్న యాదిరెడ్డి ఇంటికి ఇటీవల అధికారులు మార్కు వేసిన నేపథ్యంలో తన ఇల్లు కూలగొడతారనే దిగులుతో బ్రెయిన్‌ స్ట్రోక్‌ రావడం హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం యాదిరెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల తాతల నుంచి సంపాదించిన ఆస్తిని, నేడు కబ్జా చేశారని, కబ్జాదారులు అని చిత్రీకరించడం ఎంత వరకు సమంజసం అన్నారు. అన్ని రెవెన్యూ రికార్డుల్లో పట్టా స్థలంగా ఉందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీఆర్‌ఎస్‌ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం విఠల్‌ రెడ్డి, తోట మహేష్‌ యాదవ్‌, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌చారి,అంజయ్య, నిరంజన్‌, రామ్‌ నర్సయ్య, జంగారెడ్డి పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్‌ అభివృద్ధికి కృషి



నవజీవన్‌రెడ్డికి సమస్యలు తెలుపుతున్న ముస్లిం నాయకులు

లింగోజీగూడ: హయత్‌నగర్‌ ఖబ్రస్థాన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్‌ క్లాం నవజీవన్‌రెడ్డి తెలిపారు.డివిజన్‌ పరిధిలోని ఖబ్రస్థాన్‌ను ఆదివారం ఆయన ముస్లిం నాయకులతో కలిసి పరిశీలించారు. బోరు లేక నీటికి, విద్యుత్‌ లేకపోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందుల తలెత్తుతున్నాయని ధ్వంసమైన ప్రహరీ స్థానంలో నూతనంగా నిర్మించాలని కార్పొరేటర్‌ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులతో చర్చించి ఖబ్రస్థాన్‌ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ వెంట రఫిక్‌, సల్మాన్‌, ఆమీర్‌, బాసిత్‌, రెహమాన్‌, నయీమ్‌, అజాం తదితరులు ఉన్నారు.

సర్వే ప్రక్రియ పరిశీలన

వనస్థలిపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఐఏఎస్‌ అధికారిణి, మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ డిప్యూటీ సెక్రటరీ సీహెచ్‌.ప్రియాంకను ఎల్‌బీనగర్‌ జోన్‌కు నోడల్‌ అధికారిగా నియమించారు. ఆదివారం ఆమె హయత్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలోని శారదానగర్‌లో పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌, హయత్‌నగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ తిప్పర్తి యాదయ్య, డిప్యూటీ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ బలరాం పాల్గొన్నారు.



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రియాంక

ఉత్సాహంగా కార్తీక వనభోజనాలు



మాట్లాడుతున్న వేములయ్యగౌడ్‌

మన్సూరాబాద్‌: కౌడిన్య ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో హరిణ వనస్థలి జాతీయ పార్కులో ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు శివ నాగేశ్వర్‌రావుగౌడ్‌, రాష్ట్ర అధ్యక్షుడు కూర్మెళ్ల వేములయ్యగౌడ్‌, కాంగ్రెస్‌ నేత ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ కులస్థులు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్‌ నేతలు కాసాని సురేష్‌బాబుగౌడ్‌, ఎల్‌బీనగర్‌ ఏసీపీ కృష్ణయ్యగౌడ్‌, నాయకులు వీరమళ్ల రాంనర్సింహ్మగౌడ్‌, అంబటి శ్రీనివాస్‌గౌడ్‌, వెంకటేశ్వర్‌రావు, శేఖర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పంపిణీ

వనస్థలిపురం: ఔషధ మొక్కలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, కార్తీకంలో ఉసిరిని తినడం, పూజించడం, ఆ చెట్టు కింద వనభోజనాలు చేయడంతో శరీరానికి అవసరమైన సీ–విటమిన్‌ లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురంలో ఉసిరి, తులసి, మారేడు, రణపాల తదితర ఔషధ, పూల మొక్కలను పంపిణీ చేశారు. వనస్థలిపురం డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేష్‌, ఎస్‌ఐ ప్రభాకర్‌, జీహెచ్‌ఎంసీ స్వచ్ఛభారత్‌ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ యశశ్రీ, హెల్త్‌ ఆఫీసర్‌ నగేష్‌, కేంద్ర ఫిలిం సెన్సార్‌ బోర్డు సభ్యులు పెంటపాటి కృష్ణాదిశేషు, ప్రముఖ దంత వైద్యులు నవీన్‌ గుప్తా హాజరై మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భావన శ్రీనివాస్‌, శ్రీరంగనాథ్‌, నందకిశోర్‌, విట్టా దూరయ్య, అచ్యుతరావు, తాతయ్య, కోటేశ్వర్‌రావు, శ్రీనివాసులు, పద్మజ, నరసింహులు పాల్గొన్నారు.



మొక్కల పంపిణీలో పాల్గొన్న ప్రముఖులు

ఇందిరమ్మ రాజ్యంలోనే మత్స్యకారుల అభ్యున్నతి

మెట్టు సాయికుమార్‌

అబిడ్స్‌: ఇందిరమ్మ రాజ్యంలోనే మత్స్యకారుల అభ్యున్నతి జరుగుతుందని రాష్ట్ర ఫిషరీష్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌ పేర్కొన్నారు. 11 నెలల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మెట్టు సాయికుమార్‌ విలేకర్లతో మాట్లాడుతూ..గత పదేళ్ల బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్‌ నాయకులే కోట్లాది రూపాయాలు లూటీ చేశారన్నారు. చేపల పెంపకం పేరుతో బీఆర్‌ఎస్‌ నాయకులంతా దగా, మోసం చేశారని ఆయన ఆరోపించారు. మత్స్యశాఖను మరింత పటిష్ఠం చేసేందుకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు కర్ణాటకలోని బెంగళూర్‌, మైసూర్‌తో పాటు పలు నగరాల్లో మత్స్యశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యాటన చేపడుతామని ఆయన వివరించారు. పలు రాష్ట్రాలలో మత్స్యశాఖపై అధ్యాయనం తర్వాత రాష్ట్రంలో నూతన పాలసి తెస్తామని మెట్టు సాయి కుమార్‌ వివరించారు.

ఆకట్టుకుంటున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను పరిశీలిస్తున్న నాగరాజు

నాగోలు: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయని లయన్స్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ డిస్ట్రిక్ట్‌ సెక్రటరీ నాగరాజు అన్నారు. కొత్తపేటలోని ఐచ్‌పన్‌–అకాడమిక్‌ హైట్స్‌ పాఠశాలలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో నాగరాజు పాల్గొని మాట్లాడారు.. విద్యార్థులు తాము చదువుకుంటున్న పాఠశాల నుంచి అద్భుతాలను ఆవిష్కరించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్‌ జితేంద్రదేవి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్‌ ట్రాన్స్‌కో డివిజన్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

మూసారాంబాగ్‌, జ్ఞాన్‌దీప్‌ టవర్స్‌, కృష్ణతులసి నగర్‌, అండాళ్‌ నిలయం, డీఎస్‌ఎన్‌ఆర్‌ రోడ్‌, ఎస్‌బీహెచ్‌ బ్యాంక్‌, ఇంద్రానగర్‌, డీబీఆర్‌ డయాగ్నస్టిక్‌ సెంటర్‌, తనిష్క్‌ జువెల్లర్స్‌, నోబుల్‌ డిగ్రీ కాలేజ్‌, జీవీ బ్యాంక్‌ కాలనీ, త్రివేణీనగర్‌, వీకే ధాగేనగర్‌, ఉస్మాన్‌పురా హనుమాన్‌ టెంపుల్‌, ఎంఎంహెచ్‌, ముర్తుజా మజీద్‌, చంతిసా మజీద్‌, డీసీ పటేల్‌ కాలనీ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 వరకు..

శ్రీకార్‌ హోటల్‌, బోజిరెడ్డి కాలేజ్‌, గణేష్‌ టెంపుల్‌, వినయ్‌నగర్‌, పూసలబస్తీ, ఇండియన్‌ పెట్రోల్‌ పంప్‌, సాకేత డిగ్రీ కాలేజ్‌, సాయి డిగ్రీ కాలేజ్‌, స్పూర్తి డిగ్రీ కాలేజ్‌, సంతోషి మాతా టెంపుల్‌ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్‌ బస్‌ డిపో, దిల్‌సుఖ్‌నగర్‌, ఎంఎంహెచ్‌ హాస్పిటల్‌, తిరుమల లైన్‌, డే బ్రేక్‌ బ్యాక్‌సైడ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.23, వంకాయ రూ. 55, బెండ రూ. 55, పచ్చిమిర్చి రూ. 35, కాకర రూ. 32, బీర రూ. 45, క్యాబేజీ రూ. 35, ఫ్రెంచి బీన్స్‌ రూ. 55, క్యారెట్‌ రూ. 77, దొండ రూ. 28, చిక్కుడు రూ. 45–75, గోకర రూ. 45, బీట్‌రూట్‌ రూ. 55, క్యాప్సికం రూ. 75, ఆలు రూ. 38, చామగడ్డ రూ. 40. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వైభవంగా స్వామివారి మాస కల్యాణం

మన్సూరాబాద్‌: కార్తీక మాసం శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని మన్సూరాబాద్‌ విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రాత్రి స్వామి వారి మాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, లోకేశ్‌గౌడ్‌, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆహ్వానం



దత్తాత్రేయకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆల్కాపురిలోని శ్రీ విద్యా శక్తిపీఠంలో లోక కల్యాణార్థం ఈ నెల 25 నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించే కార్తీక మాస రుద్ర యాగ మహోత్సవంలో పాల్గొనాలని హరియాణా గవర్నర్‌ బండారు దత్తాత్రేయను ఆదివారం విద్యా శక్తిపీఠం వ్యవస్థాపకులు శ్రీ విద్య ఉపాసకులు నారాయణ చక్రవర్తి శర్మ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధాకర్‌ శర్మ, రామ్‌ సుధాకర్‌ శర్మ, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్య శర్మ, రాయప్రోలు రాఘవ శర్మ పాల్గొన్నారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి

నాగోలు: కాలనీల్లో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ సూచించారు. మోహన్‌నగర్‌లోని ఎస్‌బీహెచ్‌ కాలనీలో చెత్త కుప్పలు పేరుకుపోయాయని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఆయన పర్యటించి శానిటైజేషన్‌, రాంకీ సూపర్‌వైజర్లను పిలిపించి చెత్తను తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలన్నారు. కాలనీల్లో రోడ్డు, వీధి దీపాలు, కుక్కల బెడద, ట్రాఫిక్‌, తదితర సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ వెంట మోహన్‌రెడ్డి, బీఎన్‌ఆర్‌ రావు, శ్రీనివాస్‌, అరవింద్‌, వెంకట్‌ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న పవన్‌కుమార్‌

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

మన్సూరాబాద్‌: డివిజన్‌ పరిధి కాస్మోపాలిటన్‌కాలనీలోని మాక్సివిజన్‌ సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రి, సరిత పాలిక్లినిక్‌ ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీహాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహా, గంజి సత్తయ్య, సుధాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌, భాస్కర్‌, శ్రీకాంత్‌, విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న నర్సింహారెడ్డి

ఘనంగా బాలోత్సవం

నాంపల్లి: నృత్య భారతి ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నందమూరి తారక రామారావు కళా మందిరంలో బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల నృత్య ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథులుగా తెలంగాణ ఇండస్ట్రియల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ నిర్మలా జగ్గారెడ్డి, సినీ నటులు ధ్రువ వాయు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నృత్య భారతి పురస్కారాలు అందుకున్న నృత్య గురువులను నిర్మలా జగ్గారెడ్డి అభినందించారు. కళింగ ఫేమ్‌ డైరెక్టర్‌, కథా నాయకుడు ధ్రువ వాయు మాట్లాడుతూ..చిన్నారుల నృత్య ప్రదర్శనలను చూసే అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నారాయణ జూనియర్‌ కళాశాల వ్యవస్థాపకుడు బొల్లంపల్లి మధుకర్‌ మాట్లాడుతూ.. కళలతోనే బాలలకు సంపూర్ణమైన వికాసం, జ్ఞానం లభిస్తుందన్నారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన బాలలకు జ్ఞాపికలు, పురస్కారాలను అందజేశారు. నృత్య గురువులకు నృత్య భారతి బిరుదులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నృత్య భారతి డైరెక్టర్‌ డాక్టర్‌ మల్లేష్‌, ఇందిరా పరాశరం, రమణి సిద్ధి పాల్గొన్నారు.



బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

బీఎల్‌ఓలు లేక పోలింగ్‌ స్టేషన్‌ వెలవెల

అబిడ్స్‌: జీహెచ్‌ఎంసీ అధికారులు ఓటరు లిస్టులలో పేర్ల నమోదుకు ఆదివారం అన్ని ప్రాంతాల్లో పోలింగ్‌ స్టేషన్లలో బీఎల్‌ఓలను ఏర్పాటు చేశారు. అబిడ్స్‌ 14వ సర్కిల్‌ గోడేకబర్‌ ప్రాంతంలోని 99, 100వ పోలింగ్‌స్టేషన్ల కార్యాలయంలో బీఎల్‌ఓలు ఎవ్వరు అందుబాటులో లేరు. స్థానిక ప్రజలు ఓటరు లిస్టుల నమోదులు, ఇతర తప్పొప్పులను సరిదిద్దేందుకు దరఖాస్తుల కోసం రాగా ఎవ్వరు అందుబాటులో లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. బీఎల్‌ఓలు అందుబాటులో లేకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తులను ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందించాలని జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తే 99, 100 పోలింగ్‌స్టేషన్ల బీఎల్‌ఓలు మాత్రం అందుబాటులో లేకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్‌: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రోగ్రెసివ్‌ డెమోక్రటిక్‌ స్టూడెంట్‌ ఫెడరేషన్‌ ఆవుల నాగరాజు డిమాండ్‌ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్‌, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ఉపాధ్యాయుల కేటాయింపులలో డిప్యూటేషన్‌ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన మెస్‌ ఛార్జీలను తక్షణం అమలు చేస్తూ నాణ్యమైన భోజనం, మంచినీరు అందించి, ఫుడ్‌ పాయిజన్‌ ఘటనలు నివారించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

వీకర్‌సెక్షన్‌కాలనీ అధ్యక్షుడి ఎన్నిక



అశోక్‌యాదవ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్‌: డివిజన్‌ పరిధి వీకర్‌సెక్షన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కాసాని అశోక్‌యాదవ్‌ మరోసారి ఎన్నికయ్యాడు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కాలనీ కమ్యూనిటీహాల్లో సమావేశమై ఎన్నుకున్నట్లు అశోక్‌యాదవ్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లలో ప్రజాప్రతినిధులు, కాలనీవాసుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేయటం జరిగిందని, రాబోయే రెండేళ్లలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు.అనంతరం అశోక్‌యాద్‌ను సన్మానించారు.

నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేతమధుకర్‌ రెడ్డి తండ్రి బద్దం సుధాకర్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాళి అర్పించారు.సుధాకర్‌రెడ్డి గత నెల 30న అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం చంపాపేటలోని భారత్‌ గార్డెన్స్‌లో నిర్వహించిన దశదిన కర్మలో కిషన్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్‌ ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, తెలంగాణ బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్‌: ఈ నెల 30వ తేదీ వరకు నల్లా బిల్లుల పెండింగ్‌ బకాయిలు ఓటీఎస్‌ ద్వారా చెల్లించాలని మలక్‌పేట జలమండలి డీజీఎం హస్మత్‌అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటీఎస్‌ ద్వారా పెండింగ్‌ బిల్లుల చెల్లింపుపై విశేష స్పందన వస్తోందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



హస్మత్‌అలీ

ఉత్సాహంగా 'వుషూ' క్రీడా పోటీలు



హస్తినాపురం: హస్తినాపురంలోని శ్రీభవిష్య ఇంటర్నేషనల్‌ పాఠశాలలో రెండవ జిల్లాస్థాయి జూనియర్‌, సబ్‌ జూనియర్‌ వుషూ క్రీడోత్సవాలు ఆదివారం జరిగాయి. ఈ క్రీడోత్సవాలకు పాఠశాల చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ రమాదేవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాక్సింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బాబురావు, ప్రపంచ చాంపియన్‌ జమాలుద్దీన్‌, అబ్దుల్‌ ఉమేర్‌, సురేష్‌కుమార్‌, తాత్రే, సంతోష్‌కుమార్‌, మమతారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

రామంతాపూర్‌: డివిజన్‌ పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో అంతర్గత ప్రధాన రహదారిపై జలమండలి అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైపులైన్‌ పనుల నిమిత్తం రోడ్డును తవ్వి వదిలేశారని, దీంతో ఈ రోడ్డు ద్వారా వెళ్లే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈనెల 8న సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. తవ్వి వదిలేసిన ప్రాంతంలో కొత్తగా రోడ్డు వేశారు.